
# దొంగలున్నారు జాగ్రత్త!

"తాతాజీ"



[కలకత్తా మెయిల్‌లో సెకండుక్లాసు కంపార్టుమెంటు: సాయంకాలం అయిదుగంటలు. మెయిలు సామర్లకోట స్టేషన్ వదిలింది. పెట్టెలో నాలుగున్నరపాసెంజర్లు వున్నారు. ఒక చంటిబిడ్డ తల్లి; ఉన్నతోద్యోగిభార్య అయివుంటుంది. చదువుకున్నట్లు కనబడుతుంది. ఆమెతో యింకొక అర టిక్కెట్టు కుమారుడు. వయస్సు ఆరేళ్ళకు యెక్కువ వుండదు. తెలివైన ముఖం. ఇతర ప్యాసెంజర్లు—ఒక బుర్రమీసాల రిటైర్డ్ పోలీసు వుద్యోగి; తెల్లని ఖద్దరు బట్టలు కట్టుకున్న ఒక పెద్ద మనిషి. సిల్కుచొక్కామీద జరీఅంచు కండువా వేసుకున్న ఒక నల్లని షాహుకారు. కుర్రవాడు బెర్తుమీద పడుకుని పైకివాస్తూ చదువుతున్నాడు.]

కుర్ర : దొంగ...లు...న్నా...రు...జా...గ్ర...త్త...అమ్మా !

తల్లి : ఊఁ!

కుర్ర : దొంగలున్నారుటే ! ఎక్కడున్నారే !

త : రైల్లోనే.

కుర్ర : మన పెట్లో వున్నారా ?

(కుర్రవాడుమిగిలిన పాసెంజర్లకేసి చూస్తాడు. తన సర్వీస్‌లో పెక్కుమంది దొంగల్ని పట్టిన ఆ పోలీసు వుద్యోగి మీసాల వెనుక నవ్వుకుంటున్నాడు.)

తల్లి : (నవ్వుతూ) వట్టిదేరా. అట్లా రాస్తారు.

కుర్ర : వట్టిదే అయితే రాయడం యెందుకూ ?

(ఆ కుర్రవాడి ప్రశ్నలు తల్లికి అలవాటే కాబోలు. మామూలు తల్లుల్లాగ వీపు బద్దలు కొట్టకుండాఓపికతో సమాధానాలు చెపుతోంది.)

త : అస్తమానం వుండరు.

కు : ఎప్పుడుంటారు ?

త : రాత్రిసమయాల్లో పెట్టెలూ ఆవీ యెత్తుకు పోతూ వుంటారు.

కు : అయితే, దొంగ లున్నారని వ్రాశారేం ? వుంటారని వ్రాయక ?

త : (సమాధానం చెప్పలేక పోయింది)

(ఇంతలో చంటిపిల్లాడు ఏడ్చాడు. పాలపీక నోట్లోపెట్టి తల్లి బుజ్జగిస్తూంది.)

కు : అమ్మా ! దొంగలెట్లా వుంటారే ?

త : వాళ్లూ మనుషులేరా, మనలాగే వుంటారు.

కు : మరి దొంగలని యెలా తెలుస్తుంది ?

త : దొంగతనం చేసేవాళ్ళని దొంగ లంటారు.

కు : దొంగతనం అంటే ?

త : ఇతరుల వస్తువుల్ని కాజేయడం.

కు : అయితే, మామయ్య దొంగే !

త: ఛీ! అలా అనకూడదురా.

కు: కాదే, నిన్న నా పెన్సిల్ కాజేశాడు. మరి దొంగ కాదూ?

త : అది కాదురా, పరాయివాళ్ల వస్తువులు కాజేస్తే అది దొంగతనం.

కు : పరాయివాళ్ళంటే? మామయ్య పరాయివాడు కాదూ?

త: ఛా! మామయ్య మా తమ్ముడు కాదుట్రా, మనం అంతా బంధువులం.

కు: అయితే బంధువుల్లో దొంగతనం చేసుకో వచ్చునన్న మాట!

త: అదికాదు. దొంగలైతే చాటుగా వస్తువులు కాజేస్తారు.

కు: అయితే నువ్వు దొంగవే!

త: (ఎంచేత అన్నట్టుగా చూసింది)

కు: నాన్నగారి కోటుజేబులో నువ్వు చాటుగా డబ్బులు తీస్తూవుంటావుగా- (దొంగను పట్టుకున్న పోలీసు ముఖం పెట్టేడు)

త: (చిన్నగా నవ్వేసి వూరుకుంది)

[రాజమండ్రి ప్లాట్‌ఫారం- అదే కంపార్ట్‌మెంటు. సాయంకాలం ఆరుగంటలు. ఒక పాతికేళ్ళ యువకుడు ఆ పెట్టెలో యెక్కేడు. ఖరీదైన సూట్ వేశాడు. ఒక సూట్‌కేస్ చిన్నది చేతిలోవుంది. బండిలో కూర్చోగానే సిగరెట్ వెలిగించాడు.

తల్లి కుర్రవాడికి బిస్కట్లు కొనిపెట్టింది. బండి కదిలింది.]

కుర్ర: (ఆఖరి బిస్కట్ తింటూ) అమ్మా, దొంగలు యెందుకు దొంగతనం చేస్తారే?

త: వాళ్ళదగ్గర డబ్బులేక.

కు: ఎంచేత వుండదే వాళ్ళదగ్గర డబ్బు?

త: వాళ్ళంతా బీదవాళ్లురా. అందుకని భాగ్యవంతుల డబ్బు కాజేస్తారు.

కు: భాగ్యవంతులకి డబ్బు యెలా వస్తుంది?

త: సంపాదించుకుంటే వస్తుంది.

కు: మరి దొంగలది కూడా సంపాదనేగా?

త: కాదు. (ఎందుకు కాదో చెప్పలేకపోయింది)

[అదే కంపార్ట్‌మెంటు. నిడదవోలులో మెయిల్ ఆగింది. సాయంత్రం ఆరున్నర. టికెట్ ఎగ్జామినర్ పెట్టెలోకి వచ్చాడు. ఆ తల్లిని తప్ప మిగతావాళ్లందరి టిక్కట్లూ తనిఖీచేసి దిగిపోయాడు. అతడు పెట్టెలో వున్నంతసేపూ ఆ కుర్రవాడు యెగ్జామినర్‌కేసి చూస్తున్నాడు.]

కు: అమ్మా, ఆ వచ్చిందెవరే?

త: టికెట్ ఎగ్జామినర్.

కు: అంటే?

త: అందరికీ టిక్కట్లు వున్నాయో లేవో అని తనిఖీచేస్తాడు.

కు: మరి మనల్ని తనిఖీ చెయ్యలేదేం?

త: మనలాటివాళ్లు టికెట్టు లేకుండా ప్రయాణం చెయ్యరని వాళ్ళకి తెలుసు.

కు: మరి నాకు టికెట్ లేదుగా!

క: నీకూ వుంది. (కుర్రవాడికేసి మందలింపుగా చూసింది.)

(ఆ తల్లి అబద్ధం ఆడినట్టుగా ఆమె ముఖమే చెపుతూంది. పెట్టెలోని పాసెంజర్లు అది గమనించారో లేదో! అమాయకుడైన ఆ కుర్రవాడు మాత్రం యింకా ప్రశ్నలు వేస్తూనే వున్నాడు.)

కు: టికెట్ లేకపోతే యేంజేస్తారే?

త: ఏంచేస్తారు? జైల్లో కూడా పెడతారు.

కు: వాళ్లు టిక్కట్లు యెందుకు కొనుక్కోరు?

త: బీదవాళ్లు కదూ, డబ్బులేక.

కు: వాళ్లు యెంచేత బీదవాళ్లు అయ్యేరు?

(మళ్ళీ అదే ప్రశ్న వచ్చింది. ఈ లోకంలో కొందరు ధనవంతులుగానూ, కొందరు బీదవాళ్ళుగానూ యెందుకు వున్నారని యిటువంటి కుర్రవాళ్ళంతా ప్రశ్నిస్తూనే వున్నారు. ఇంతవరకూ యేతల్లీ, యేతండ్రీ దానికి సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఈ తల్లి మాత్రం యేం చెప్తుంది?)

[గూడూరు జంక్షన్, తెల్లవారుజాము మూడుగంటలు. స్టేషన్‌లో బండి నిలబడగానే తల్లి నిద్రపోతూన్న కుర్రవాడిని లేపింది. కూలీ అని కిటికీలోనుండి కేకవేస్తూవుండగా ఆమెకోసం వచ్చిన భర్త కంపార్ట్‌మెంటులోకి వచ్చాడు. కుర్రవాడు నాన్న దగ్గరికి జేరాడు. అందరూ దిగారు: జవాను, కూలీలూ సామాన్లు దింపుతున్నారు.]

తల్లి: (జవానుతో) వెంకయ్యా. సామాన్లుఅన్నీ దిగినాయా?

జవా: దిగాయమ్మా - రెండు పరుపులూ, నాలుగు పెట్టెలూ...

త: నాలుగుపెట్టె లేమిటి? అయిదూ!

(జవాను సామాన్లు మళ్లీ లెక్కపెట్టేడు)

జ: అంతేనమ్మా, నాలుగు పెట్టెలేవున్నాయి.

త: (కంగారుగా) సరిగా చూడండిరా! నాపట్టు చీరెలన్నీ ఆ పెట్టెలోనే వున్నాయి!

ఆఫీసరు : ఆకంపార్ట్‌మెంటులోనే వుందేమో చూడండి సరిగా.

(కంపార్ట్‌మెంటు అంతా వెదికారు. పెట్టె లేదు. పాసెంజర్లని అడిగేరు. మాకు తెలియదంటే తెలియదన్నారు. పెట్టెలోవున్న పింఛను పోలీసు వుద్యోగి ప్లాట్‌ఫారంమీదకి దిగి వచ్చాడు.)

పో. వు: (ఆఫీసరుతో) గుడ్‌మార్నింగ్ సార్! మీ పెట్టె పోయినందుకు వెరీ సారీ. రాజమంత్రిలోఒకకుర్రాడు యెక్కాడండీ సూటూ గట్రా వేసుకొని! ఎక్కడ దిగిపోయాడో తెలియదుకాని, వాడే కాజేసివుండాలి. నేను మొదట్లోనే సస్పెక్టు చేశానండీ, వెరీసారీ!

(కుర్రవాడు యీ హడావిడి అంతా గమనిస్తూనేవున్నాడు.)

కుర్ర: (ఆఫీసరుతో) నాన్నగారూ, సూట్ వేసుకున్నవాళ్లూకూడా దొంగతనం చేస్తారా?

(తన అరటిక్కెట్టు కొడుకు యీ ప్రశ్న యెందుకు వేశాడో ఆ తండ్రికి అర్థంకాలేదు. మెయిల్ కదిలింది.)

# ఇంకా జనవరిజీతం రాలేదు

## మహమ్మద్ ఇస్మాయిల్

ఎయిడెడ్ యెలిమెంటరీ ఉపాధ్యాయులకు ఏనెల జీతం ఆనెల ఇస్తారన్న మద్రాసు ప్రభుత్వ ప్రకటన విని చాల సంతోషించాను. కాంగ్రెసు మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వోద్యోగులు-ఇంతెందుకు-పండిట్ జీ, పటేలు జీలతోపాటు నేనుకూడ ఇకనుంచి ప్రతినెల జీతము పుచ్చుకుంటానని గర్వంగా నా సతీ తిలకానికి, స్నేహితులకు చెప్పేశాను. అదెందుకోగాని నాకీ అర్థంకాని రీతిని పిల్లకాయలకు పాఠాలు చెప్పటంలో హుషా రెక్కువైంది. ఆర్థికమైన ఇబ్బందులకు, బాలురకు విద్య నేర్పించుటకు ఎంత అవినాభావ సంబంధం వుందో ఆ రోజు తెలుసుకోగలిగాను. నాకు అవసరమైన నా దైనిక జీవితావసర వస్తువులు ప్రజాప్రభుత్వం పూర్తిగా సహాయం చేస్తే అప్పుడు నా సర్వశక్తులు వివిధంగా విద్య గరపుటలో కేంద్రీకరించగలనో వూహించగలిగాను.

'ఇక మీకేం ఫరవాలేదు. ఏనెల కానెల పారవేస్తాం. నెల జీతములు వస్తున్నాయి' అని ధీమాతో అప్పులవాళ్ళకు సమాధానం చెప్పాను. అల్పసంతోషులైన కొంతమంది ఉపాధ్యాయులు అప్పుడే ప్రభుత్వం చేసిన ఘనకార్యాలు పొగడసాగారు. సమ్మె పరిస్థితికి దించకుండానే మదరాసు ప్రభుత్వం ఎయిడెడ్ వుపాధ్యాయుల ప్రధానమైన కోర్కెను తీర్చినందుకు సంతోషాన్ని వెలిబుచ్చుచూ ఒక అభినందన తీర్మానం డి. ఐ. గారి అధ్యక్షతక్రింద సెంటర్ క్లాసు మీటింగులో ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

1949 జనవరి నెలనుంచి ఎయిడెడ్ వుపాధ్యాయులకు మూడునెలల కొకసారి జీతమిచ్చే పద్ధతికి స్వస్తిచెప్పి ప్రతినెల జీతములు ఇచ్చుటకు ప్రభుత్వం నిర్ణయించిందని అసెంబ్లీలో విద్యాశాఖామంత్రిగారు ప్రకటించారు. ఆ విశదీకరణ 'ఆంధ్రప్రభ'లో చూచి ఆనందభరితుడ నయాను. ఏజెంటుకు ఒక్క అణా తరువాత ఇస్తానని పేపరుకొని సోదర వుపాధ్యాయుల కందరికీ టాంటాం చేశాను.

అఖిలభారత జాతీయ కాంగ్రెసు నాయకులు "ప్రజలంతా స్వతంత్రభారత పునర్‌నిర్మాణ కార్యక్రమాన్ని బలపరచాలి. బాపూజీ మనలను వీడినా, ఆయన ఆదర్శాలింకా జీవించేవున్నాయి" అన్న ప్రకటనలతో జనవరి 26 వ తేది స్వాతంత్ర్య దినోత్సవం సాఫీగా జరిగిపోయింది. స్వర్గీయ సరోజినీదేవి కొరకు సంతాపతీర్మానాలు తయారుచేసి ప్రవేశపెట్టి, యం. పి. కు పంపుటకు ఫిబ్రవరి నెలంతా కావలసివచ్చింది. అందువల్ల నేమో జనవరినెల జీతం ఫిబ్రవరి ఆఖరువరకు రాలేదు. మార్చినెలలో వీరభగవత్ సింగ్ వర్ధంతి